సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 9 । జూలై । 2025



తారకరామకు మోక్షమెప్పుడో?
రెండు దశాబ్దాలుగా సాగుతున్న ప్రాజెక్టు తారక రామ తీర్థసాగర్. 2005 ఫిబ్రవరి 19న ప్రారంభించిన ప్రాజెక్టు అంచెలంచెలుగా అంచనా వ్యయం పెరుగుతోందే తప్ప పనులు మాత్రం పూర్తి కావడం లేదు. - 8లో



హిట్ అండ్ రన్' వాహనాలను వెంటనే గుర్తించాలి - 8లో
హిట్ అండ్ రన్ కేసుల్లో వాహనాలను వెంటనే గుర్తించాలని పోలీస్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం ఆదేశించారు.



నరక దారులు - 8లో
పార్వతీపురం మన్యం జిల్లాలోని రోడ్లతోపాటు ఆంధ్రా-ఒడిశా ప్రాంతాలకు రాకపోకలకు అనువైన అంతర్‌రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులతో ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది.

● ఊరూరా వైఎస్సార్ జయంతి



పాలకొండ రూరల్: పాలకొండ వైఎస్సార్ కూడలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు



పార్వతీపురంటౌన్: వైఎస్సార్ జయంతి సందర్భంగా పార్వతీపురం పట్టణంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పార్టీ నాయకులు

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం ఊరూరా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకులు కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పేదలకు దుస్తులు, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జయంతి కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్ అందించిన అభివృద్ధి, సంక్షేమ పాలనను గుర్తుచేసుకున్నారు. - సాక్షినెట్‌వర్క్



సాలూరు రూరల్: మామిడిపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద మహిళలతో కలిసి కేక్ కట్‌చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పాల్గొన్న నాయకులు

న్యూస్‌రీల్

శివుడ్ని దర్శించుకున్న వానరం



శివుడి దగ్గర వానరం

పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని శ్రీసర్వమంగళాదేవి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలోని శివుడిని మంగళవారం ఓ వానరం దర్శించుకుని తన భక్తిని చాటుకుంది. దీన్ని గమనించిన భక్తులు తమ సెల్‌ఫోన్లలో ఆ సన్నివేశాన్ని బంధించారు. ఆ వానరం శివలింగం వద్ద కొంత సమయం గడిపి అక్కడ ఉన్న ప్రసాదం స్వీకరించడాన్ని చూసిన భక్తులు పులకించారు. కలియుగంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతుంటాయని, ఈ సృష్టిలో ఉన్న సకల చరాచర జీవరాశులు ఏదో రూపంలో తమ భక్తిని ప్రదర్శిస్తుంటాయని శ్రీవిద్యా సర్వమంగళా పీఠాధిపతి మురపాక కాళీదాసుశర్మ యాజీ తెలిపారు.

శాకంబరిగా కోటదుర్గమ్మ



పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మవారు మంగళవారం శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వారాహి నవరాత్రులు అనంతరం అమ్మవారు ఏటా భక్తులకు శాకంబరిగా దర్శనమివ్వడం ఆనవాయితీ. ఆ మేరకు కూరగాయలు, పండ్లతో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ విగ్రహాన్ని, ఆలయాన్ని అర్చకులు అలంకరించారు. ఆషాఢమాసం ఆడపిల్లగా అమ్మవారికి చీర, సారెలను సమర్పించారు. దేవదాయశాఖ తరఫున ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, ఆలయ ఈఓ సూర్యనారాయణ అమ్మవారికి కానుకలు సమర్పించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించారు.

ఎన్‌ఐఏ కస్టడీలో సిరాజ్, సమీర్

విజయనగరం క్రైమ్: ఉగ్రభావజాలంతో పేలుళ్లకు కుట్రపన్ని విశాఖ సెంట్రల్ జైల్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న సిరాజ్, సమీర్‌లను మంగళవారం అర్ధరాత్రి ఎన్‌ఐఏ తమ కస్టడీలోకి తీసుకున్నట్టు సమాచారం. వాస్తవానికి కొద్ది రోజుల కిందటే ఎన్‌ఐఏ అధికారులు ఐదుగురు ఈ కేసు విషయమై విజయనగరం టూటౌన్ పోలీసులను కలిశారు. కోర్టు అనుమతితో నిందితులు ఇద్దరినీ ఎన్‌ఐఏకు అప్పగించాల్సి ఉంది. రెండు రోజుల కిందట కోర్టు వీడియోకాన్ఫరెన్స్‌లో ఇద్దరు ఖైదీలను విచారించింది. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఇక నుంచి ఎన్‌ఐఏ అధికారులు కేసును విచారణ జరపనున్నట్టు టుటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

యూరియా.. దొరికితే మీ అదృష్టం!



సీతానగరం మండలం బూర్జ రామమందిరం వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు



మక్కువ పీఏసీఎస్ వద్ద మంగళవారం ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

- పీఏసీఎస్‌ల్లో కానరాని ఎరువు నిల్వలు
- ప్రైవేట్ వర్తకుల వద్ద అధిక ధరలు
- అదనంగా ఇంకేదైనా తీసుకోవాలని మెలిక
- ఆవేదనలో రైతన్న

సాక్షి, పార్వతీపురం మన్యం:

పార్వతీపురం మన్యం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మెట్ట పంటల సాగుతో పాటు వరి నాట్లు ఆరంభమయ్యాయి. వరి వెదలు, నారుమడులు, మొక్కజొన్న, పత్తి తదితర పంటలకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వేయాల్సిన సమయం ఇది. లేదంటే దిగుబడిపై ప్రభావం పడుతుంది. ఎరువుల కోసం పీఏసీఎస్‌లకు రైతులు పరుగులు తీస్తున్నా ప్రయోజనం లేకపోతోంది. ఎక్కడా ఎరువుల కొరత లేదని అధికారులు చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన ఉండడం లేదు. పీఏసీఎస్‌లు, ప్రైవేట్ వర్తకుల వద్ద గంటలకొద్దీ బారులు తీరుతున్నా ఎరువు దొరుకుతుందన్న నమ్మకం లేదు. ఉసూరుమంటూ వెనుదిరగాల్సిన పరిస్థితి. ఇదే సమయంలో వచ్చిన కొద్దిపాటి నిల్వలనూ కూటమి నాయకులు తన్నుకుపోతుండడం గమనార్హం.

అదనపు వసూళ్లు..

యూరియా, డీఏపీ నిల్వలు లేవంటూ వ్యాపారులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. బస్తా వద్ద కనీసం రూ.50కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. దీంతోపాటు.. యూరియా కావాలంటే డీఏపీ తీసుకోవాల్సిందేనని, లేకుంటే ఇంకేదైనా పురుగు మందులు కొనాల్సిందేనని పట్టుపడుతున్నారు. కొన్నిచోట్ల సరైన రసీదులు కూడా ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. మరికొందరుల నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. దీనిపై ఏటా ఆరోపణలు వస్తున్నా.. అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యం. జిల్లాలోని ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలూ కలిపి సుమారు 2.20 లక్షల ఎకరాల్లో సాగవుతాయి. వరి ఒక్కటే 1.70 లక్షల ఎకరాల్లో సాగవుతుంది. ఈ సీజన్‌లో ఖరీఫ్‌కు అవసరమైన సుమారు 45,277 మెట్రిక్ టన్నులను అధికారులు సిద్ధం చేశారు. రైతు సేవా కేంద్రాలతోపాటు.. మార్క్‌ఫెడ్, ప్రైవేట్ వర్తకులు, పీఏసీఎస్‌ల్లో నిల్వలను అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయికి వచ్చేసరికి రైతులకు ఎరువుల కోసం ఇబ్బందులు తప్పడం లేదు.

కొరత లేదంటున్న అధికారులు

జిల్లాలో ఒకవైపు రైతులు ఎరువుల కోసం అవస్థలు పడుతుంటే.. అధికారులు మాత్రం ఎక్కడా కొరత లేదని అంటున్నారు. జూలై చివరి నాటికి జిల్లాలో దాదాపు 21,542 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 19,357 మెట్రిక్ టన్నులు వచ్చాయని.. వాటిని పంపిణీ చేశామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం ప్రారంభ నిల్వతో సహా 8,920 మెట్రిక్ టన్నుల లభ్యత ఉందని చెబుతున్నారు. 3,563 మెట్రిక్ టన్నుల యూరియా, 2,293 ఎంటీల డీఏపీ, 1,501 ఎంటీల కాంప్లెక్స్, 570 మెట్రిక్ టన్నుల పొటాష్, 990 మెట్రిక్ టన్నుల సూపర్ ఫాస్ఫెట్ ఉన్నాయని అంటున్నారు. కొద్ది రోజుల్లో 5 వేల టన్నుల యూరియా, మూడు వేల టన్నుల డీఏపీ వస్తుందని కలెక్టర్ తెలిపారు. కొరత లేదని.. అంతా సవ్యంగా ఉందని చెబుతున్న అధికారులకు గ్రామాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు కనిపించకపోవడం శోచనీయమన్న వాదన వినిపిస్తోంది.



ఇటీవల సాలూరు మండలంలో వర్షంతోనే గొడుగులు వేసుకుని ఎరువుల కోసం వేచి ఉన్న కర్షకులు

- కొమరాడ మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. నిల్వలు వస్తున్నా.. కూటమి నాయకులే 'సర్దుకుంటున్నారు'. మండలంలో కొమరాడ, శివిని పీఏసీఎస్‌లు ఉండగా.. ఇటీవల 180 చొప్పున బస్తాలు వచ్చాయి. అవి కూటమి నాయకులు, కార్యకర్తలకే సరిపోయాయి. రైతు సేవా కేంద్రాలకు ఇండెంట్ పెట్టామనే ఇంకా అధికారులు చెబుతున్నారు. రూ.267 ఉన్న యూరియా బస్తా పార్వతీపురంలోని ప్రైవేట్ వర్తకులు రూ.350 చొప్పున విక్రయిస్తున్నారు. మండలానికి తీసుకొచ్చి విక్రయించేసరికి ధర రూ.450 అవుతోంది. డీఏపీ కూడా నిల్వలు లేవు. వరికి డీఏపీ, యూరియా లేకపోతే దిగుబడి మీద ప్రభావం చూపే అవకాశం ఉందని ఇక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారు.
- సాలూరు మండలంలోని మామిడిపల్లి, సాలూరు, శివరాంపురం తదితర పీఏసీఎస్‌ల్లో ఎక్కడా డీఏపీ, యూరియా నిల్వలు లభించడం లేదు. ఇటీవల శివరాంపురం పీఏసీఎస్‌లో 16 గ్రామాల రైతులు ఉదయం నుంచి ఎరువు కోసం బారులు తీరారు. అందులో 20 శాతం మందికి కూడా ఎరువు దొరకలేదు. బయట ఎక్కడైనా లభించినా.. రూ.50 అదనంగా తీసుకోవడమే కాక, దాంతోపాటు రూ.300కు తగ్గని పురుగు మందు ఏదైనా తీసుకోవాలని కొర్రీ పెడుతున్నారు.
- సీతానగరం మండలంలో యూరియా నిల్వలు వస్తే.. రైతుల కంటే ముందు టీడీపీ కార్యకర్తలకే సమాచారం వెళ్తోంది. దీంతో వారు రాత్రికి రాత్రే స్లిప్పుల రాసి తమ కార్యకర్తలకు ఇచ్చేస్తున్నారు. స్లిప్పులు ఉన్న వారికే బస్తాలు ఇస్తున్నారు. బూర్జ, లక్ష్మీపురం గ్రామాల్లోని రామ మందిరాల వద్ద మంగళవారం యూరియా పంపిణీ చేయగా.. అక్కడ వాగ్వాదం చోటుచేసుకుంది.
- మక్కువ మండలంలోనూ పూర్తిస్థాయిలో నిల్వలు దొరకడం లేదు. ఇక్కడ ఎరువుల ధరల్లో వ్యత్యాసాలు ఉండడంతో కొద్దిరోజుల కిందట అధికారులు దుకాణాలపై ఆకస్మిక దాడులు చేశారు. శంబరలోని ఓ దుకాణంలో వ్యత్యాసాన్ని గుర్తించారు. 2,399 బస్తాల్లోని 119.925 టన్నుల ఎరువు సీజ్ చేశారు.
- పాలకొండ మండలంలోనూ డీఏపీ, యూరియా లభించడం లేదు. స్థానికంగా లభ్యమవుతుందని ఇన్నాళ్లూ చూసిన రైతులు.. అదును దాటిపోవడంతో బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేసుకుంటున్నారు.

అన్నీ అడ్డంకులే..



ఈ ఏడాది వ్యవసాయానికి అన్నీ అడ్డంకులే. ఓ వైపు వాతావరణం సహకరించడం లేదు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి సాయమూ దక్కలేదు. నాకున్న భూమితో పాటు, మరికొంత కౌలుకు తీసుకుని సేద్యానికి సిద్ధమయ్యాను. నారుమడి సిద్ధంచేసి ఉడుపులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నా. ఎరువులు లేవు. ప్రస్తుతం రైతులకు అవసరమైన యూరియా కూడా దొరకడం లేదు. దీంతో సమీప జిల్లాకు, మండలాలకు వెళ్లి బస్తాపై రూ.100 మేర అదనంగా చెల్లించి తీసుకుంటున్నాం. ఇతర ప్రాంతాల నుంచి రావాలంటే రవాణా ఖర్చులు మరింత అవుతున్నాయి.

– కరణం భాస్కరరావు, రైతు, లుంబూరు గ్రామం, పాలకొండ మండలం

యూరియా కోసం నిరసన



చిలకలపల్లి రైతుభరోసా కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి గ్రామంలో అవసరమైన రైతులకు యూరియా అందడం లేదని, నాయకులకు, కార్యకర్తలకు అందిస్తున్నారని రైతులు కృపారావు, ఉమామహేశ్వరరావు, వెంకటి, మురళి తదితరులు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. గ్రామంలో రైతులు, కౌలు రైతులకు యూరియా దొరకకపోవడంతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. వచ్చిన యూరియాను నాయకులు, కార్యకర్తలు సర్దుకుంటున్నారని ఆరోపించారు. ప్రైవేట్ మార్కెట్‌లో సక్రమంగా అందుబాటులోకి రావడం లేదని, వచ్చినా అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. నారుకు ప్రస్తుతం యూరియా ఎంతో అవసరమని తక్షణమే రైతులకు అవసరమైన యూరియాను సరఫరాచేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కష్టాలు మొదలయ్యాయంటూ వాపోయారు.

కూటమి పాలనపై
ఏడాదికే వ్యతిరేకత

- మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేయకుండా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజావ్యతిరేకత మొదలైందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పీడిక రాజన్నదొర అన్నారు. సాలూరులో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రైతులు, మహిళలు, యువత తదితర వర్గాలు బహిరంగంగా కూటమి పాలనను వ్యతిరేకిస్తున్నాయన్నారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు, లేదంటే అప్పటివరకు నెలకు రూ.3వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారని, నేటికి ఒక్కరికీ కూడా భృతి అందజేయలేదన్నారు. రాష్ట్రంలో కోటీ 56 లక్షల మంది నిరుద్యోగులుంటే 20 లక్షల మంది ఉన్నట్టు లెక్కలు వేయడం చంద్రబాబు మోసపూరిత పాలనకు నిదర్శనమన్నారు.

ఆడబిడ్డ నిధి అమలెప్పుడు?

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున అందజేశారని, కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధికింద ఇస్తామన్న నెలకు రూ.1500 ఎప్పుడిస్తారని రాజన్నదొర ప్రశ్నించారు. కోటీ 60 లక్షల మంది మహిళలు పథకం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమ్మఒడి పథకం లబ్ధిని సుమారు 80 లక్షల మంది పిల్లల తల్లుల ఖాతాలకు జమచేస్తే నేడు ఎంతమంది పిల్లలుంటే అంతమందికే అని చెప్పి కేవలం 64లక్షల మందికే ఇచ్చారని, మిగిలిన 16 లక్షల మంది చదువులు మానేశారా అని ప్రశ్నించారు. చాలా మంది ఎస్సీ విద్యార్థులకు రూ.8వేలు, రూ.10 వేలు మాత్రమే జమచేయడం విచారకరమన్నారు. 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఊరించి ఉసూరు మనిపిస్తున్నారన్నారు.

లోకేశ్‌ను సైకో అని ఎందుకు అనకూడదు?

గత ప్రభుత్వం అమ్మఒడి పథకం కింద ఇచ్చే రూ.15వేలలో పాఠశాలల నిర్వహణ కోసం తొలుత రూ.వెయ్యి, తర్వాత రూ.2వేలు కేటాయిస్తే జగన్ సైకో అంటూ విమర్శలు చేసిన ప్రస్తుత విద్యాశాఖమంత్రి లోకేశ్‌ను ఇప్పుడు పెద్దసైకో అని ఎందుక అనకూడదని రాజన్నదొర ప్రశ్నించారు. మహిళల ఆత్మగౌరవం కాపాడతానని, పది రోజుల్లో రూ.20లక్షల ఖర్చుతో పట్టణంలోని మరుగుదొడ్లకు మరమ్మతులు చేయిస్తామని మంత్రి సంధ్యారాణి చెప్పారని, నేటికీ పనులు చేయకపోవడం విచారకరమన్నారు. మక్కువ రోడ్డు మూడు నెలల్లో పూర్తిచేస్తామని చెప్పిన మంత్రి ఆ విషయాన్ని మర్చిపోయారన్నారు. గత ప్రభుత్వ హయాంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం, ట్రెజరీ కార్యాలయం ఆధునికీరణ, ఎంపీడీఓ కార్యాలయం, బైపాస్‌రోడ్డు, విత్తనశుద్ధి కేంద్రం తదితర భవనాల నిర్మాణాలు పూర్తిచేసినట్టు వెల్లడించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 70 శాతం మేర వందపడకల ఆస్పత్రి పనులు పూర్తిచేశామని, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మిగిలిన 30 శాతం పనులు పూర్తిచేయలేదని విమర్శించారు.

క్లుప్తంగా

కొట్టిశలో ఎక్సైజ్ శాఖ దాడులు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

వంగర: మండల పరిధి కొట్టిశ గ్రామంలో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. రాజాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యాపారులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అమరాన వెంకటరావు, కల్లూరి గవరయ్య, నూరి పోలిరాజుల నుంచి 29 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ



సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ అధికారి కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: విజయనగరం సబ్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధికారి ఎ.కృష్ణప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయవిజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల తోటి ఖైదీలు గానీ, సిబ్బంది గానీ ఎటువంటి వివక్ష చూపించ రాదన్నారు. జైలు క్లినిక్‌లను సందర్శించే న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు నిర్వహిస్తున్న విధుల పట్ల ఆరా తీశారు. జైల్లో ఉన్న ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆకస్మిక తనిఖీలో సబ్ జైల్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగా సావిత్రి



కె.సావిత్రి

విజయనగరం టౌన్: డీఆర్‌డీఏ, వెలుగు ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కె.సావిత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ పీడీగా పనిచేసిన కల్యాణ్ చక్రవర్తి సెర్ప్ డైరెక్టర్‌గా బదిలీ అవడంతో, ఏపీడీ సావిత్రికి పీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ తమ సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా అధికారులను, సిబ్బందిని కోరారు. సమష్టిగా పనిచేసి పథకాలను, ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ స్వరూప రాణి

మక్కువ : ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చూసుకోవాలని ఎంపీడీవో డీడీ స్వరూప రాణి అన్నారు. ఈ మేరకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో పండ్ల మొక్కలను మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. మొక్కలు ఎదుగుదల అయ్యేంతవరకు వాటి సంరక్షణ బాధ్యత తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో శంబంగి.ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యాన పంటలతోనే ఆర్థికాభివృద్ధి



కాలేజీ ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ఉద్యాన పంటలు సాగు చేయడం తోనే అదనపు ఆదాయం వస్తుందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, తద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలున్నాయన్నారు. కాలుష్య నివారణ, వాతావరణంలో సమతుల్యం, అదనంగా ఫలసాయాన్ని ఇవ్వడంలో దోహద పడుతుందన్నారు. ఉపాధిహామీ పథకం ఏపీఓ బాలకృష్ణ మాట్లాడుతూ మొక్కలు నాటడానికి చిన్న, సన్నకారు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉచితంగా మొక్కలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు, ఉపాధిహామీ పథకం ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తారకరామకు మోక్షమెప్పుడో?




నిర్మాణం నిలిచిపోయిన తారకరామ తీర్థసాగర్ స్పిల్‌వే

- 20 ఏళ్లయినా పూర్తికాని ప్రాజెక్టు పనులు
- రూ.804 కోట్లకు పెరిగిన నిర్వహణ వ్యయం
- పనుల్లో అంతులేని జాప్యం
- పట్టించుకోని ప్రభుత్వం



తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు వ్యయం, ఆయకట్టు ఎకరాల చిత్రం



చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలోని తారక రామ తీర్థ సాగర్ బ్యారేజీ స్థాన చిత్రం

పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేస్తేనే పనులు

కూటమి ప్రభుత్వంలో సరిపడా నిధులు వస్తేనే 2026 చివరికైనా తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురాగలం. ఈ ప్రాజెక్టు ద్వారానే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నీరందించాల్సి ఉంది. ప్రాజెక్టు వ్యయం రూ.804 కోట్లకు పెరగడంతో ఇప్పుడు ఈ ప్రభుత్వం విడుదల చేసే నిధులు ఏ కోశానా సరిపడవు. పై మొత్తం నిధులు విడుదలైతేనే 2026 డిసెంబర్ నాటికి విజయనగరం పట్టణానికి, భోగాపురం విమానాశ్రయానికే కాకుండా సుమారు 20 వేల ఎకరాలకు కూడా నీరందించగలం.

– అప్పలనాయుడు, తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు ఈఈ

విజయనగరం గంటస్తంభం: రెండు దశాబ్దాలుగా సాగుతున్న ప్రాజెక్టు తారకరామ తీర్థసాగర్. 2005 ఫిబ్రవరి 19న ప్రారంభించిన ప్రాజెక్టు అంచెలంచెలుగా అంచనా వ్యయం పెరుగుతోందే తప్ప పనులు మాత్రం పూర్తి కావడం లేదు. రాష్ట్రంలో 15 ఏళ్ల పాటు సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబునాయుడు ఏనాడూ ప్రాజెక్టు పూర్తికి చిత్తశుద్ధితో చర్యలు తీసుకోలేదు. ఉత్తరాంధ్రలో అత్యంత కీలకమైన ప్రాజెక్టును పూర్తి చేయడానికి గత వైఎస్ జగమోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టులో అంతర్భాగమైన కుమిలి రిజర్వాయర్‌లో మిగిలిన పనులను రూ.150.24 కోట్లతో పూర్తి చేయాలని జలవనరుల శాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో గల 49 గ్రామాల్లోని 24,710 ఎకరాలకు సాగు నీరందుతుంది.

భూసేకరణే అసలు సమస్య..

తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుకు అవసరమైన 3497.58 ఎకరాల భూమికిగాను 3278.32 ఎకరాలను సేకరించారు. మిగతా 219.26 ఎకరాల సేకరణపై అధికారులు దృష్టిపెట్టారు. కుమిలి రిజర్వాయర్ ప్రాజెక్టులో కోరాడపేట, ఏటీ అగ్రహారం, పడాలపేట ముంపునకు గురవుతాయి. ఈ గ్రామాల్లోని 2,219 కుటుంబాలకు పునరావాసానికే రూ.209.88 కోట్లు అవసరం. అయితే ప్రభుత్వం తాజాగా కేవలం రూ.5కోట్లు మాత్రమే కేటాయించింది. తాడిపల్లి, కుదిపి, నీలంరాజు పేట గ్రామాల నిర్వాసితులకు పరిహారానికి రూ.75.69 కోట్లు ఖర్చవుతుంది. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలోగా నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. నిర్వాసితులకు పునరావాసం కల్పించాక చంపావతి నుంచి నీటిని మళ్లించి, ఆయకట్టుకు నీళ్లందించడంతో పాటు విజయనగరం కార్పొరేషన్‌కు తాగునీరు సరఫరా అవకాశం కుదురుతుంది.

ప్రాజెక్టు నిర్మాణం ఇలా..

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జలయజ్ఞంలో భాగంగా తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. విజయనగరం జిల్లా గుర్ల మండలం కోటగండ్రేడు వద్ద చంపావతి నదిపై 184 మీటర్ల పొడవున బ్యారేజీ నిర్మించి అక్కడి నుంచి 13.428 కిలోమీటర్ల కాలువ ద్వారా కుమిలిలో నిర్మించే రిజర్వాయర్‌కు 27 టీఎంసీల నీటిని మళ్లిస్తారు. ఇక్కడి నుంచి కుమిలి చానల్ సిస్టం పరిధిలోని 8,172 ఎకరాలను స్థిరీకరించడంతో పాటు కొత్తగా 16,538 ఎకరాలకు సాగునీందించాలి. వైఎస్సార్ మరణానంతరం అధికారంలోకి వచ్చిన పాలకులు ప్రాజెక్టు పనులు పట్టించుకోలేదు. 2014 నుంచి 2019 మధ్య పాలన సాగించిన చంద్రబాబునాయుడు ప్రాజెక్టు పనుల ఊసెత్తలేదు. అనంతరం అధికారం చేపట్టిన వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్యారేజీ నిర్మాణాన్ని దాదాపు పూర్తిచేశారు. మళ్లింపు కాలువ, కుమిలి రిజర్వాయర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. కుమిలి రిజర్వాయర్ డైక్–2, డైక్–3ల లో 2.2 కిలోమీటర్ల మట్టికట్ట పనుల్లో రూ.150.24 కోట్ల పనులు మిగిలాయి. వాటిని చేపట్టిన కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో 60–సీ నిబంధన కింద కాంట్రాక్టర్‌ను తొలగించి, పనులను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఆ మేరకు ప్రతిపాదనలను జ్యూడిషియల్ ప్రివ్యూకు పంపారు.

తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు ప్రాజెక్టు కీలకం

విజయనగరం పట్టణానికి తాగునీరు, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలను తీర్చడమే కాకుండా సుమారు 20వేల ఎకరాలకు పైగా సాగు నీరు అందించే తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఎంతో అవసరం. ప్రాజెక్టుకు అరకొరగా నిధులు కేటాయించడంతో ఈ ఏడాది పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు. మరి 2026 నాటికల్లా నీరు రాకుండా ఉంటే తాగునీరు సమస్య, అటు పారిశ్రామిక, విమానాశ్రయానికి నీరు లేక వెలవెలబోతుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే ఎయిర్‌పోర్టు అవసరాలకు తాగునీరు, వాడుక నీరు ప్రధానం కావున ఇందుకోసం తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాల్సి ఉంది.

శతశాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: ఎస్సీ, ఎస్టీ రైతులు, ఐదు ఎకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు రూ.2.18 లక్షల విలువైన డ్రిప్ పరికరాలను 100 శాతం రాయితీతో అందిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టంచేశారు. 5 నుంచి 10 ఎకరాలు భూమి కలిగిన రైతులకు గరిష్ఠంగా రూ.3.18లక్షల విలువైన డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీతో అందజేస్తామని చెప్పారు. కలెక్టరేట్‌లో వ్యవసాయాధికారుల సమీక్షలో ఆయన మంగళవారం మాట్లాడారు. జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి 2090 హెక్టర్లలో బిందు, తుంపర సేద్యం లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

మిషన్ కల్పవృక్షతో అద్భుత ఫలితాలు

జిల్లాలో తలపెట్టిన మిషన్ కల్పవృక్ష కార్యక్రమంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. జిల్లావ్యాప్తంగా 5 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగుచేయాలన్నది లక్ష్యంగా నిర్దేశించామన్నారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పరిధిలో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. గొర్రెలు, మేకల పెంపకాన్ని, పశుపోషణను ప్రోత్సహించాలని, వీడీవీకేలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పలువురు పాల్గొన్నారు.

పట్టాలిచ్చి గిరిజనులపై కేసులు పెడతారా?

- సీపీఎం నాయకుడు పి రాము



సీతంపేట గిరిజనులతో మాట్లాడుతున్నసీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: గిరిజనుల జీవనోపాధికోసం అప్పటి ప్రభుత్వ అధికారులు గిరిజనులు సాగు చేసిన పోడు భూములకు జీఓ ప్రకారం అటవీశాఖ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో సంగంవలస పంచాయతీ సీతంపేట గ్రామంలో నివసిస్తున్న గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశారని సీపీఎం మండల అధ్యక్షుడు పి.రాము అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని సీతంపేటను సందర్శించిన అక్కడి గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో అన్నిశాఖల సమన్వయంతో ఇచ్చిన పట్టా భూముల్లో జీవనోపాధి కోసం గిరిజనులు సాగు చేస్తున్న భూముల్లోకి అటవీశాఖాధికారులు వెళ్లి సీతంపేట గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. భూములపైకి వెళ్లి వారిపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ధ్వజమెత్తారు. పట్టాలిచ్చి అమాయకులైన గిరిజనులపై ఏ విధంగా కేసులు పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అటవీశాఖ అధికారులు ఎందుకు భూములపైకి గిరిజనులను రానివ్వకుండా నిలువరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించి పరిష్కారం చూపాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన సీసీఆర్సీ పంపిణీ జరగాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో యుద్ధప్రాతిపదికన సీసీఆర్ కార్డుల పంపిణీ జరగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. సొంత భూమిలేని కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు అందించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే రెవెన్యూ శాఖ జారీచేసే కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని, ఈ కార్డులు కలిగిన వారు మాత్రమే పంట నమోదు చేసుకునే అవకాశం ఉందని, పంట నమోదు ఆధారంగా పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర వ్యవసాయ పథకాలు అమలవుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. కావున ఇన్ని ప్రయోజనాలు ఉన్న సీసీఆర్ కార్డుల పంపిణీ త్వరగా పూర్తిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా త్రైమాసికానికి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలు, సాధించిన ప్రగతి వివరాలను ఎప్పటికప్పుడు తన కు నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా గ్రామ వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి డా.ఎస్.మన్మథరావు, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి ఏవీ సాల్మన్ రాజు, మత్స్య అభివృద్ధి అధికారి యు.చాందిని, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని దివ్యాంగుడి మృతి

దత్తిరాజేరు: మండలంలోని ఎస్ బూర్జవలస పోలీస్ స్టేషన్ పరిధి కుంటినవలస రోడ్డులో ఎదురుగా వస్తున్న మూడు చక్రాల వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కుంటినవలస గ్రామానికి చెందిన దివ్యాంగుడు జక్కు సత్యం(69)తలకు తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మెంటాడ మండలం కుంటినవలస గ్రామానికి చెందిన సత్యం దివ్యాంగుడు కావడంతో సోమవారం సాయంత్రం మూడు చక్రాల వాహనంపై మరడాం వచ్చి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా కుంటినవలస నుంచి ద్విచక్ర వాహనంపై మరడాం వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో ప్రమాదం జరిగి మృతి చెందినట్లు తెలిపారు.

'హిట్ అండ్ రన్' వాహనాలను వెంటనే గుర్తించాలి

- ఎస్పీ ఆదేశాలు



డీపీఓలో హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: హిట్ అండ్ రన్ కేసుల్లో వాహనాలను వెంటనే గుర్తించాలని నమోదైన కేసుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పోలీస్ సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం ఆదేశించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న 'హిట్ అండ్ రన్, గుర్తు తెలియని మృతదేహాల కేసులను ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. 'హిట్ అండ్ రన్' కేసుల్లో నేరానికి పాల్పడిన వాహనాన్ని సాధ్యమైనంత వేగంగా గుర్తించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. నేర స్థలం నుంచి వాహనం వెళ్లే మార్గంలోగల అన్ని సీసీ కెమెరాలను, ఫుటేజులను, టోల్ గేట్స్ రికార్డులను పరిశీలించాలని సూచించారు. కేసుల్లో దర్యాప్తు అంశాలను ఎప్పటికప్పుడు కేసు డైరీల్లో పొందుపర్చాలని స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్‌కే చౌదరి, ఎస్.శ్రీనివాస్, ఎల్.అప్పలనాయుడు, బి.సుధాకర్, వివిధ పోలీసు స్టేషన్ల చెందిన పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా ప్రధాన కేంద్రంలో నిర్మితమవుతున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనం పనులు వేగవంతం కావాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఆకస్మిక పర్యటనలో భాగంగా నిర్మాణ దశలో ఉన్న ఆస్పత్రిని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ ఆస్పత్రి అదుబాటులోకి వస్తే స్థానికంగా ఉన్న వారితో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ పర్యటనలో ఆస్పత్రి వైద్యులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురంటౌన్: ఓటర్ల జాబితా తయారీలో నిర్దిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అన్నారు. ఓటర్ల జాబితా పునఃశ్చరణపై బూత్ స్థాయి అధికారులకు మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ఓటరు కొత్తగా చేరడం, ఓటరు జాబితా నుంచి తొలగించడం, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారేటప్పుడు సవరణ చేయడం వంటి ప్రక్రియ ఓటర్ జాబితా సవరణలో ప్రధానమైన అంశాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగలు, నగదు చోరీపై ఫిర్యాదు



పిల్లి రాము ఇంట్లో తెరిచి ఉన్న బీరువా

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో చెరువు గట్టు వీధిలో నివాసం ఉంటున్న పిల్లి రాము ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పార్వతీపురం పట్టణ పోలీసులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తన భార్య బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి తన రోజువారీ పనుల నిమిత్తం చంటి బయటకు వెళ్లగా తిరిగి వచ్చి చూసేసరికి వేసిన తాళం వేసినట్లు ఉండి ఇంట్లో ఉన్న బీరువా తెరిచి బట్టలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో దొంగతనం జరిగినట్లు పిల్లి రాము గుర్తించారు. ఈ చోరీలో ఐదు తులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ.12 వేల నగదు అపహరించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నరక దారులు

పార్వతీపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న రహదారులతో పాటు ఆంధ్రా–ఒడిశా ప్రాంతాలకు రాకపోకలకు సాగించేందుకు ప్రధానంగా ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారి సైతం పూర్తిగా ధ్వంసమై భారీ గుంతలతో చెరువులను తలపిస్తున్నాయి. ప్రజా సంఘాలు, స్థానికులు, వాహనదారులు ఎప్పటికప్పుడు వినూత్నంగా రహదారి అధ్వాన స్థితిపై నిరసనలను తెలియజేస్తున్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేస్తామని చేసిన వాగ్దానం ఎక్కడా నెరవేర్చినట్లు కానరావడం లేదని ప్రజా సంఘాల నాయకులు రోడ్ల దుస్థితిపై దుమ్మెత్తి పోస్తున్నారు. వాహనాలు గుంతల్లో తిరగబడి ప్రమాదాలకు గురవుతున్నా పాలకులకు, సంబంధిత అధికారులకు ఎందుకు పట్టడం లేదో అని ఆందోళన చెందుతున్నారు.



:పార్వతీపురం నుంచి కొరాపుట్ వైపు వెళ్లే రహదారి



గుంతలతో దారుణంగా మారిన పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి

కూటమి పెద్దల మాటలు ఏమయ్యాయి?



కూటమి పాలనలో రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. అందుకు ప్రధాన సాక్ష్యం పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న రహదారే. అధికారంలోకి వస్తే అద్దంలా రోడ్లను మారుస్తామని చెప్పిన కూటమి పెద్దలు ఏడాది పాలన పూర్తయినప్పటికీ రోడ్ల మరమ్మతుల విషయంలో ఎలాంటి పురోగతి చూపడం లేదు. జిలా కేంద్రం సమీపంలోని పార్వతీపురం నుంచి చినబొండపల్లి మధ్య, గరుగుబిల్లి–బురదవెంకటాపురం రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తక్షణమే రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలి.

బీవీ రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి.